క్లుప్తంగా

స్పాట్ అడ్మిషన్లు వాయిదా

తిరుమలగిరి (తుంగతుర్తి): విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా పాలిసెట్ 2023 స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ వాయిదా వేసినట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు ఆగస్టు 1న స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వంతెన నిర్మించాలి



కోదూరు వాగులో నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

అర్వపల్లి: తిమ్మాపురం–సంగెం రహదారిపై కోదూరు, సంగెం వాగు వద్ద వెంటనే వంతెన నిర్మించాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కోదూరు వాగు వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీ మేరకు వంతెన పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ దాసరి శ్రీనివాస్, మండల ఇన్‌చార్జ్ చెరుకుపల్లి లక్ష్మణ్, నియోజకవర్గ అధ్యక్షుడు మల్లెపాక వెంకటేష్, ప్రధాన కార్యదర్శి శోభ, మనీషా, యాదగిరి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారిణి స్రవంతి

తుంగతుర్తి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆయిల్‌పామ్ తోటలకు తెగుళ్లు సోకకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారిణి స్రవంతి సూచించారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు.

30న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవగాహన

సూర్యాపేటటౌన్: ఎన్‌జీఓస్ అసోసియేషన్, అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎన్‌జీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాస రాంకుమార్‌రెడ్డి, కార్యదర్శి చకిలం హరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో పాల్గొనాలనుకునే వారు రిజిస్ట్రేషన్‌కు సెల్ నంబర్ 93917 00001ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పెన్‌పహాడ్ : చీదెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పెన్‌పహాడ్‌లోని బీసీ బాలుర వసతి గృహంలో గురువారం విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ రమేష్, సీఈఓ సోమ్లా, లక్ష్మణ్, సైదులు, రవి, కాకునూరి నాగరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాగరత్నంకు నివాళి

పెన్‌పహాడ్: మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన యల్లావుల నాగరత్నం ఇటీవల మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి వెంకన్న, బీసీ మండల అధ్యక్షుడు ఆవుల అంజయ్య, మహబూబ్‌అలీ, నవీన్, నాగరాజు, రవి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

పెన్‌పహాడ్: దివ్యాంగులకు పింఛన్ డబ్బులను రూ. 4,016లకు పెంచిన సందర్భంగా పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనాజీపురం గ్రామంలో సర్పంచ్ చెన్ను శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులు సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నూతనకల్: దండెంపై దుస్తులు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందిన ఘటన నూతనకల్ మండలంలోని ఎడవెల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎడవెల్లి గ్రామానికి చెందిన వనం సైదులు (37) సుతారీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన అతడు స్నానం చేసేందుకు గాను దుస్తులను ఇంట్లోని దండెంపై వేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం మృతుడి తమ్ముడు రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు ఎస్ఐ తెలిపారు.



కోదూరులో జలమయమైన వరిపొలాలు



నాగారం: పసునూర్‌లో అలుగుపోస్తున్న పెద్ద చెరువు



చివ్వెంలలో నిండుకుండలా ఊర చెరువు

ఉప్పొంగిన వాగులు

- నిలిచిపోయిన రాకపోకలు
- ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు
- నీట మునిగిన పత్తి, వరి పొలాలు



ఏపూరు వద్ద బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు

చివ్వెంల(సూర్యాపేట) : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పలు గ్రామాల్లో పత్తి చేలలో నీరు చేరాయి.

చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు

సూర్యాపేట రూరల్: కురుస్తున్న భారీ వర్షాలకు సూర్యాపేట మండలంలోని పిన్నాయిపాలెం, సఫవట్ తండా, పిల్లలమర్రి, దాసాయిగూడెం, ఇమాంపేట, కేటీ అన్నారం, కాసరబాద గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరింది. పలు చెరువులు అలుగుపోస్తున్నాయి.

ఉధృతంగా గుండ్లసింగారం పాలేరు వాగు

నూతనకల్: మండల పరిధిలోని గుండ్లసింగారం శివారులోని పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిపై నుండి నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో రాకపోకలు నిలిపివేశారు. నూతనకల్–చిల్పకుంట్ల గ్రామాల మధ్య ఉన్న తుమ్మల చెరువు పూర్తిస్థాయిలో నిండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుండ్లసింగారం పాలేరు బ్రిడ్జి వెంబడి రోడ్డు కోతకు గురైంది. మండలంలో పలు గ్రామాల్లో వరి, పత్తి చేలల్లో వర్షపు నీరు చేరడం వలన పంటలకు నష్టం వాటిల్లింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి నీటిని బయటకు తరలించారు. పలు గ్రామాల్లోని అలుగులు పోయడంతో గ్రామస్థులు చేపల వేటను కొనసాగించారు.

ఆత్మకూర్‌లో భారీ వర్షం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఏపూరు శివారులో గల బిక్కేరు బ్రిడ్జి పైనుంచి 6 ఫీట్ల ఎత్తులో వరద ప్రవహిస్తోంది. నశీంపేట శివారులో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి ఉన్న డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. ఈ కారణంగా చివ్వెంల –ముకుందాపురం రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. పాతర్లపహాడ్ గ్రామంలో అయ్యవారికుంట తండా చెరువు నుంచి శంభుని చెరువులోకి వరద నీరు వచ్చే కరకట్ట ముదిరాజ్ కాలనీ వద్ద బుధవారం అర్ధరాత్రి తెగిపోయింది. కాలనీలోకి భారీగా వరద నీరు చేరడంతో గండిపూడ్చారు. కాలనీలో కలెక్టర్ పర్యటించారు. నశీంపేట వద్ద తెగిపోయిన రోడ్డును ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు. ఇక్కడ 24గంటల పాటు పోలీసులు సిబ్బంది విధుల్లో ఉండాలని ఆదేశించారు. ఆత్మకూర్‌లో భీమునికుంట అలుగుపోయడంతో దుబ్బగూడెంలోని పలు ఇళ్లు నీట మునిగాయి. అబ్బగాని లింగయ్యకు చెందిన ఇల్లు కూలిపోయింది. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు తహసీల్దారు పుష్ప, ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, ఎస్ఐ వెంకటరెడ్డి, ఏఓ దివ్య అత్యవసర సమావేశం నిర్వహించారు.

అర్వపల్లి జలమయం

అర్వపల్లి: వర్షంతో అర్వపల్లిలోని సంత ఆవరణ, పోలీస్‌స్టేషన్‌రోడ్డులో ఇళ్లు, దుకాణాలు జలమయమయ్యాయి. కాసర్లపహాడ్‌లో వేముల పెదనర్సయ్య ఇల్లు కూలిపోయింది. జాజిరెడ్డిగూడెం శివారులోని మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. కోడూరులో వాగు ఉధృతంగా ప్రవహించి వరి పొలాలు జలమయమయ్యాయి.

నాగారంలో వర్ష బీభత్సం

నాగారం: మండలంలో వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరి, పత్తి పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పస్తాల కల్వర్టు దగ్గర ఉన్న బంధం వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండంతో రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్మాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలింది. లక్ష్మాపురం, డి.కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న బంధాల వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఫణిగిరి, పసునూర్, డి.కొత్తపల్లి గ్రామాల్లో మూడు ఇళ్లు వర్షాలకు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నాగారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ మండల స్థాయి అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రమాదకరంగా ఉన్న చెరువులు, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు పరిశీలించారు. పెద్ద చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉండటంతో తూము పక్కన 5 మీటర్ల మేర జేసీబీతో కట్టను తొలగించి నీటిని బయటకు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఇరిగేషన్ డీఈఈ పిచ్చయ్య, ఎస్ఐ ముత్తయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చందన, ఏఓ గణేష్, డీటీ షాహిన్‌బేగం, ఎంపీఓ ధార శ్రీనివాస్, ఆర్ఐ లక్ష్మీనర్సింహరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



నూతనకల్: చెరువును తలపిస్తున్న పంట పొలాలు

మద్దిరాలలో..

మద్దిరాల: మద్దిరాల మండలంలో బుధవారం రాత్రి 11సెం.మీ. వర్షపాతం కురిసింది. మండల కేంద్రం నుంచి కుంటపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గుమ్మడవెల్లి గ్రామ చెరువు కట్ట తెగిపోయే పరిస్థితి ఉండడంతో మత్తడిని కొంత మేర తొలగించారు. కుక్కడం పెద్దచెరువు అలుగు ఉధృతి ఎక్కువగా ఉండి నీరు గ్రామంలోకి రావడంతో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, తహసీల్దార్ అమీన్‌సింగ్, సీఐ, ఎస్ఐలు పర్యటించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అన్ని శాఖల అధికారులతో వరద తీవ్రతపై సమీక్షించారు.

భీమారం బ్రిడ్జిపై రాకపోకలు నిలుపుదల

సూర్యాపేట రూరల్: మూసీ నది నుంచి భారీగా వరద నీరు దిగువకు వదలడంతో భీమారం బ్రిడ్జిపై నుంచి నీరు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తోందని తహసీల్దార్ వెంకన్న, రూరల్ ఎస్ఐ సాయిరాంలు తెలిపారు. గురువారం రాత్రి భీమారం బ్రిడ్జిని వారు సందర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లోని టోల్‌ఫ్రీ నంబర్ 6281492368తోపాటు, డయల్ 100ను సంప్రదించాలన్నారు.

తిరుమలగిరిలో 19 సెం.మీ. వర్షపాతం

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరిలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన వర్షానికి 19 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తాటిపాముల, అనంతారం గ్రామాల నుంచి వెళ్తున్న బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరదకు బోరు మోటార్లు కొట్టుకుపోయాయి. పత్తి చేలల్లో నీరు నిలిచింది. తొండ, వెలిశాల గ్రామాల్లో నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరగడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షానికి నాలుగు ఇళ్లు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. కాగా.. చెరువులు, కుంటలు అలుగు పోస్తుండటంతో చేపలు ఎదురెక్కుతున్నాయి. పంట పొలాల్లోకి సైతం వస్తుండడంతో కర్రలతో చేపలను కొడుతూ పట్టుకున్నారు.

తుంగతుర్తిలో..

తుంగతుర్తి: తుంగతుర్తికి చెందిన నర్సయ్య పెంకుటిల్లు వర్షాలకు కూలిపోయింది. బుధవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.



ఏపూరులో నీట మునిగిన పంట పొలాలు



మద్దిరాల- కుంటపల్లి ప్రధాన రహదారి పైనుంచి వెళ్తున్న వరద



తిరుమలగిరి: పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు



సూర్యాపేట రూరల్: బ్రిడ్జి పైనుంచి రాకపోకలు సాగించకుండా కాపలాగా ఉన్న పోలీసులు



తుంగతుర్తిలో వర్షాలకు కూలిన పెంకుటిల్లు



ఫణిగిరిలో కూలిన ఇల్లు



తిరుమలగిరి : వెలిశాలలో కూలిన విద్యుత్ స్తంభం

బిక్కేరు వాగు పరిశీలన



బిక్కేరు వాగును పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తిరుమలగిరి తహసీల్దార్ రమణారెడ్డి కోరారు. గురువారం తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం అనంతారంలోని బిక్కేరు వాగును పరిశీలించారు. వివిధ గ్రామాల్లో ఇళ్లను పరిశీలించి వరద ప్రవాహాన్ని అంచనా వేశారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఉంటే సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, ఎంపీడీఓ ఉమేష్‌చారి, ఎస్ఐ ప్రసాద్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యాధికారిణి వందన, పంచాయతీ అధికారి మారయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దు

తుంగతుర్తి: మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాంప్రసాద్ సూచించారు. గురువారం మండల పరిధిలోని వెంపటి, గొట్టిపర్తి, రావులపల్లి తదితర గ్రామాల్లోని చెరువుల వద్దకు వెళ్లి కట్టల నాణ్యతను పరిశీలించారు. ప్రజలు శిథిలావస్థల్లో ఉన్న ఇళ్లలో ఉండొద్దన్నారు. వానలు తగ్గేవరకు పాఠశాలలు, పంచాయతీ భవనాల్లో ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రవీందర్ రెడ్డి, సర్పంచ్ అబ్బగాని పద్మ సత్యనారాయణ, ఉపసర్పంచ్ వెంకన్న, నాగయ్య, వెంకన్న, మల్లయ్య, సుధాకర్, వీరస్వామి తదితరులున్నారు.

జలమయమైన ప్రాంతాల పరిశీలన

అర్వపల్లి: భారీ వర్షాలకు అర్వపల్లితో పాటు మండల వ్యాప్తంగా జలమయమైన ప్రాంతాలను గురువారం మండల ప్రత్యేక అధికారి రామారావు నాయక్, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, హైవే ఏఈఈ ప్రియదర్శిని, నీటిపారుదల శాఖ ఏఈఈ హరిస్వరూప్ పరిశీలించారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోడూరు వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు.

వర్షాభావ పరిస్థితులపై సమీక్ష

సూర్యాపేట రూరల్: భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకన్న సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులకు వర్షాభావ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ సాయిరాం, సీడీపీఓ కిరణ్మయి, ఏఓ జానిమియా, ఏఈ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు

మద్దిరాల: మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుక్కడం, గుమ్మడవెల్లి గ్రామాల్లో నీట మునిగిన పంటలను మండల వ్యవసాయ అధికారి వికాస్ పాటిల్ గురువారం పరిశీలించారు. పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పత్తి పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

సూర్యాపేట రూరల్: అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పత్తి పంటలో తగిన జాగ్రత్తలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి జానిమియా అన్నారు. గురువారం మండల పరిధిలోని బాలెంల గ్రామంలో పత్తి పంటలను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఏఈఓ అయేషా, రైతులు జక్కుల యాదయ్య, కన్నెబోయిన సైదులు, బీరెల్లి సత్తిరెడ్డి, శివలింగం తదితరులున్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన

అర్వపల్లి: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు అర్వపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 22వ రోజుకు చేరింది. కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దొంగరి భిక్షమయ్య ఇటీవల మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఒంటెద్దు నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, సర్పంచ్ నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సీతారాంరెడ్డి, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, మాజీ సర్పంచ్ సోమయ్య, భద్రయ్య, జడ వీరయ్య, కత్తి ఉపేందర్, అరవింద్ పాల్గొన్నారు.



భిక్షమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అర్వపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు అన్నారు. గురువారం కొత్తగూడెంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక, గ్రామస్తులు రామసాని రవీందర్, తన్నీరు బాలయ్య, అండాలమ్మ తదితరులు పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఆటో చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

చివ్వెంల(సూర్యాపేట): ఆటో అపహరణ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ సూర్యాపేట జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. నూతనకల్ మండలం తాళ్లసింగారం గ్రామానికి చెందిన వల్లపు అరుణ్ సూర్యాపేట పట్టణంలోని శ్రీసాయి గణేష్ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. తన ఆటోలో రోజూ సూర్యాపేటకు వచ్చి ల్యాబ్‌లో పనిచేసుకుని తిరిగి ఇంటికి వెళ్లేవాడు. ఈ క్రమంలో 1 ఏప్రిల్, 2023న ఆటోను సూర్యాపేట పట్టణంలోని శివజ్యోతి హాస్పిటల్ ముందు పార్కింగ్ చేసి ల్యాబ్ పనులు చేసుకుని సాయంత్రం వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో బాధితుడు రెండు రోజుల ఆటో కోసం గాలించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఖమ్మం జిల్లా గుడిమళ్ల గ్రామానికి చెందిన గోసుల వెంకన్న ఆటోను చోరీ చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురువారం విచారణకు రాగా సూర్యాపేట జూనియర్ సివిల్ జడ్జి పలువురు సాక్షులను విచారించి పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) హేమలత వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ గన్న ప్రతాప్ సహకరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

నూతనకల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన నూతనకల్ మండల పరిధిలోని పెద్దనెమిల గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దనెమిల గ్రామానికి చెందిన రాచకొండ విప్లవ్(35) పని నిమిత్తం తన బైక్‌పై బుధవారం మహబూబాబాద్ జిల్లా పరిధిలోని మరిపెడ బంగ్లాకు వెళ్లి అర్ధరాత్రి తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. గురువారం తెల్లవారుజామున పెద్దనెమిల గ్రామ శివారులోని రాగానే 365వ నంబర్ జాతీయ రహదారిపై బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రహదారిపై వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



విప్లవ్ (ఫైల్)

కాచి చల్లార్చిన నీటిని ఇవ్వాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రాంపతి

పెన్‌పహాడ్ : దోసపహాడ్ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం మండల ప్రత్యేక అధికారి రాంపతి సందర్శించారు. విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి సిబ్బంది కాచి చల్లార్చిన నీటిని ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామ శివారులోని మూసీ నది పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో వర్షాలపై అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి కృష్ణసందీప్, పీఆర్‌ఏఈ గోపి, ఎంపీఓ నరేష్, ఏపీఎం అజయ్, హెడ్‌కానిస్టేబుల్ మురళీధర్‌రెడ్డి, దొంగరి యుగేందర్ పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

- ఏపీడీ పెంటయ్య

మద్దిరాల: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే అధికారులపై చర్యలు తప్పవని ఏపీడీ పెంటయ్య హెచ్చరించారు. మద్దిరాల మండలంలో 2020 నుంచి 2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై 2వ విడత సామాజిక తనిఖీ సమావేశాన్ని గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. జరిగిన పనులు, జరగాల్సిన పనులు, పెండింగ్ బిల్లులు, మంజూరైన బిల్లులు, మస్టర్లలో తేడాలపై ఆరా తీశారు. తేడాలు ఉంటే ఏపీఓలు,, ఈసీలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లను మందలించి, వాటిని పూర్తి చేయకపోతే షోకాజ్ నోటీసులు అందజేస్తామని హెచ్చరించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనుల్లో రూ.6,06,532 లను రికవరీ చేయనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలకు కలిపి రూ.19వేల జరిమానా విధించినట్లు చెప్పారు. చాలా వరకు మస్టర్లలో కొట్టివేతలు గమనించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా తనిఖీ అధికారులు లచ్చిరాం నాయక్, అజయ్, విజిలెన్స్ జిల్లా అధికారి ఆశారాణి, ఏపీఓలు గుండు వెంకన్న, రవీందర్‌నాయక్, శ్రీరాములు, ఈశ్వర్, ఈసీ చారి, సుమలత, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ పెంటయ్య

వ్యక్తిపై దాడి.. నిందితులపై కేసు

నూతనకల్: పాత కక్షలతో వ్యక్తిపై దాడి చేసిన ఐదుగురు నిందితులపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సీహెచ్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామానికి చెందిన భగవత్ భద్రగిరి ట్రాక్టర్‌తో తన వ్యవసాయ పొలం దున్నుతుండగా.. అదే గ్రామానికి చెందిన బదావత్ సంజీవ, బదావత్ తేజ, భగతవ్ వీరన్న, బదావత్ కళ్యాణి, బదావత్ వాచీ పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని భద్రగిరి ముఖంపై పారతో కొట్టడంతో ముక్కుకు బలమైన గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.